సాక్షి పల్నాడు

7

ఆదివారం । 12 । మే । 2024



సభా ప్రాంగణానికి వస్తుండగా సీఎం వైఎస్ జగన్ ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న జనసందోహం



మధ్యాహ్నం 12 గంటలకు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం



ఇంటి నుంచి సీఎం వైఎస్ జగన్‌ను చూస్తున్న ఓ కుటుంబం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటం పట్టుకుని కేరింతలు కొడుతున్న యువకులు



సీఎం వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న చిన్నారులు

మార్మోగిన జగన్నినాదం

- సీఎం వైఎస్ జగన్ చిలకలూరిపేట సభకు పోటెత్తిన జనం
- మేమంతా సిద్ధం అని నినదించిన ప్రజలు
- చంద్రబాబు మోసాల పాలనను వివరించిన సీఎం
- ఐదేళ్ల ప్రజాపాలనలో జరిగిన మేలు గుర్తుచేసిన వైనం
- రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి మనోహర్‌నాయుడు, అనిల్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపు

సాక్షి, నరసరావుపేట: జై జగన్ జై జై జగన్... నినాదాలతో చిలకలూరిపేట పట్టణం మారుమోగింది. చిన్నా, పెద్ద, ఆడా, మగ అనే తేడా లేకుండా గొంతెత్తి నినదించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో శనివారం ఏర్పాటుచేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. జననేత రాకతో చిలకలూరిపేట జనసంద్రమైంది. సీఎం వైఎస్ జగన్ బహిరంగసభ వద్దకు చేరుకోగానే జగన్నినాదంతో ఆ ప్రాంతం మారుమోగింది. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు నాయకులు, అభిమానులు ఉత్సాహంగా కనిపించారు. ప్రసంగంలో సీఎం సిద్ధమా.. అనే పిలుపునకు సభికులంతా పిడికిలి బిగించి మేమంతా సిద్ధం అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ జగన్ ప్రసంగిస్తున్న సమయంలో గొంతు కలిపి బాబుకు వ్యతిరేకంగా నినదించారు. నువ్వే మా నమ్మకం జగన్ ... మళ్లీ నువ్వే రావాలి జగన్ అంటూ నినదించారు. సీఎం బహిరంగసభలో మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు, జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లను పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

పేదల తలరాతలు మారాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి

వలంటీర్లు మరలా ఇంటికే రావాలన్నా... అవ్వాతాతల పెన్షన్ మళ్లీ ఇంటికే రావాలన్నా.. బటన్లు నొక్కిన పథకాల సొమ్ము మళ్లీ నా అక్కచెల్లెమ్మల ఖాతాలకు నేరుగా రావాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన కొనసాగాలన్నా.. పేదల భవిష్యత్, పేదల తలరాతలు మారాలన్నా.. మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా.. మన వ్యవసాయం, మన ఆసుపత్రులు మెరుగుపడాలన్నా... ఇవన్నీ జరగాలంటే ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కాలని వైఎస్ జగన్ అన్నారు. ఈ ప్రసంగం సమయంలో ప్రజలు చేతులు పైకెత్తి ఫ్యాన్ గుర్తు చూపుతూ ఉత్సాహంగా మద్దతు పలికారు. ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కి 175కి 175 అసెంబ్లీ స్థానాలు, 25కి 25 ఎంపీ స్థానాలు ఒక్కటి కూడా తగ్గేందుకే వీలు లేదు. సిద్ధమేనా? అనే పిలుపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

చంద్రబాబు మోసం చేయడానికి వస్తున్నాడు ...

రేపు జరిగే కురుక్షేత్ర యుద్ధం కేవలం ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకొనే ఎన్నికలు కాదని, మీరు వేసే ఓటు మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని సీఎం జగన్ అన్నారు. ఈ ఎన్నికలలో జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు, పొరపాటున చంద్రబాబుకు ఓటువేస్తే పథకాలన్నీ ముగింపేనన్నారు. దీనికి స్పందనగా ఫ్యాన్ గుర్తుకే మళ్లీ ఓటేస్తామని ప్రజలు స్పందించారు. ఈ 59 నెలల పాలనలో లంచాలు, వివక్షలేని పాలన అందించామని సీఎం జగన్ అన్నారు. ఒక్కసారి ఆలోచన చేసి మంచి జరిగితేనే ఓటు వేయాలన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాల పుట్ట అని సీఎం పేర్కొన్నారు. 2014లో ఏం చెప్పాడు, 2014 నుంచి 2019 మధ్య ఎంతటి మోసపూరితమైన పాలన అందించాడో ఒకసారి గుర్తుచేసుకోవాలన్నారు. 2014 మేనిఫెస్టోను చూపించి అందులో రాసిన హామీలు అమలయ్యాయా అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికి కొత్త మేనిఫెస్టోతో వస్తున్నాడు గమనించాలని కోరారు.



మనోహర్ నాయుడు, అనిల్‌లను ఆదరించండి...

- కావటి శివ నాగమనోహర్‌నాయుడు మంచివాడు, సౌమ్యుడు మంచి చేయాలని ఉద్దేశంతో ఉన్నవాడని సీఎం జగన్ అన్నారు. 'గుంటూరు మేయర్‌గా ఉన్న మనోహర్‌ను చిలకలూరిపేట ప్రజలకు సేవ కావాలి, వారికి అండగా ఉండాలి అంటే వచ్చాడు. మీ చల్లని దీవెనలు ఆశీస్సులు ఇవ్వండి. ఇక్కడే నివాసం ఉంటాడు అందరికీ అందుబాటులో ఉంటాడు, ఇది మీ జగన్ హామీ' అని పేర్కొన్నారు.
- అనిల్ నా తమ్ముడు, యువకుడు, ఉత్సాహవంతుడు మంచి చేయడానికి ముందుకు వచ్చాడు, మీ చల్లని దీవెనలు, చల్లని ఆశీస్సులు అనిల్‌పై ఉంచాలని సవినయంగా కోరుతున్నానన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన కాంగ్రెస్ నేత

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీ నేత అట్లూరి విజయ్‌కుమార్ వైఎస్సార్‌సీపీలో చేరారు. విజయ్‌కుమార్ 2019లో వినుకొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు.

ఎన్నికల తర్వాత టీడీపీ శాశ్వతంగా కనుమరుగు

పి అనిల్‌కుమార్ యాదవ్,
నరసరావుపేట ఎంపీ అభ్యర్థి



చిలకలూరిపేట: ఎన్నికల తర్వాత టీడీపీ శాశ్వతంగా మూతపడే పార్టీ అని...రాష్ట్రంలో ఉండేది వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఆ పార్టీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు నాలుగేళ్లుగా వైఎస్ జగన్ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, కేవలం ప్రజలకు డబ్బులు పంచుతున్నాడని విమర్శించేవాడని తెలిపారు. ఓటమి భయంతో చంద్రబాబు నాయుడు జగన్‌కన్నా మూడురెట్లు ఎక్కువ ఇస్తానని ప్రచారం చేసుకుంటున్నాడని అన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఎన్ని అబద్ధాలైన చెబుతాడని విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. జగనన్నకు ఓటు వేస్తే అన్ని సంక్షేమ పథకాలు కొనసాగి కుటుంబాలు చల్లగా ఉంటాయని చెప్పారు. కూటమికి ఓటు వేస్తే కేవలం పప్పు, తుప్పులకు మాత్రమే మేలు జరుగుతుందని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అని మనస్ఫూర్తిగా పలికే నాయకుడు ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నరసరావుపేట ఎంపీ స్థానం తొలిసారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు కేటాయించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నకు అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు.

జగనన్న ప్రభుత్వంలో ప్రజలే పాలకులు

కావటి శివనాగ మనోహర్‌నాయుడు, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి



వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే ప్రజలే పాలకులని చెప్పారు. అలా కాకుండా టీడీపీకి అధికారం అప్పగిస్తే ప్రతి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన ఇద్దరు ముగ్గురు టీడీపీ నాయకులు లేదా జన్మభూమి కమిటీ సభ్యులు పెత్తనం చేస్తారని అన్నారు. పెత్తందార్ల వైపు టీడీపీ, జనసేన, బీజేపీ ఉంటే, పేదవాడి పక్క ఒకే ఒక్కడు జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. కులం, మతం, వర్గం, చివరకు పార్టీ కూడా చూడకుండా జగనన్న పాలనలో ప్రభుత్వ పథకాలు వివక్ష లేకుండా అందరికీ లభించాయని చెప్పారు. 2014 ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఎందుకు పనికిరాని ఆయన తనయుడిని మంత్రి చేసుకున్నాడని ఎద్దేవా చేశారు. కూటమి ఏర్పడ్డాక తొలిసారిగా చిలకలూరిపేటలోని బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి గుడి పక్కన నిర్వహించిన సభలో సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌పై కూటమి నేతలు విమర్శలకు దిగితే ఆగ్రహించిన ఆంజనేయస్వామి మైకులు పనిచేయకుండా కట్ చేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు మూడు పార్టీలతో పొత్తు పెట్టుకుని అలవికాని హామీలు, అసత్య ప్రచారాలతో ముందుకు వస్తున్నాడని, ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తులు

నరసరావుపేట ఈస్ట్: వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన బాలలకు పురస్కారాలు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాల, బాలికలు జూలై 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ సమరోత్సాహం

- ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా భారీ ర్యాలీ
- ప్రచార రథంపై ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్, డాక్టర్ గోపిరెడ్డి
- మండుటెండలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ప్రచార రథంపై నుంచి ప్రజలను పలకరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఈనెల 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఏజెంట్లతో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో వచ్చిన నాయకులు, కార్యకర్తలు తీన్‌మార్, బాణసంచా మోతల మధ్య మండుటెండను లెక్కచేయకుండా ర్యాలీలో పాల్గొన్నారు. అభ్యర్థులు రెడ్డినగర్‌లోని వరసిద్ధి వినాయకస్వామి, అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్నాడు రోడ్డు, గడియారం స్తంభం, శివునిబొమ్మసెంటర్, మెయిన్‌రోడ్డు మీదగా మల్లమ్మసెంటర్ వరకు నిర్వహించారు. అక్కడి నుంచి ఓవర్ బ్రిడ్జి మీదుగా ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ప్రకాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. మధ్యలో ర్యాలీలో కార్యకర్తలతో కలసి డాక్టర్ గోపిరెడ్డి ట్రాక్టర్, ద్విచక్ర వాహనం నడుపుతూ కనిపించారు. డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ ర్యాలీలో నడుస్తూ ముందుకు సాగారు. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లతో రైతన్నలు పాల్గొన్నారు. టీడీపీ గుర్తు సైకిల్‌ను కొందరు యువకులు బైక్‌కు కట్టి ఈడ్చి ధ్వంసం చేశారు. దానిపై నుంచి ట్రాక్టర్లను రైతన్నలు నడిపారు. ఉప్పలపాడు గ్రామం నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వచ్చి పాల్గొన్నారు. పాల్గొన్న వారందరికీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, పట్టణ కన్వీనర్ ఎస్ఏ హనీఫ్, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ముదిరాజు, స్వచ్ఛాంధ్ర, గిరిజన, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈఎం స్వామి, ఎస్.సుజాతాపాల్, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పడాల సాంబశివారెడ్డి, డాక్టర్లు కేజే మోహనరెడ్డి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, కొమ్మసాని కమలాకర రెడ్డి, కనకా పుల్లారెడ్డి, కాపులపల్లి ఆదిరెడ్డి, చల్లా నారపరెడ్డి పాల్గొన్నారు.

ఐదేళ్లలో వినుకొండ రూపురేఖలు మార్చాం

- ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు
- మరో అవకాశం ఇస్తే ఇంజినీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాలలు ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంతంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పరిశీలకులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, న్యాయవాది ఎం.ఎన్.ప్రసాద్‌లతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు ఓటమి భయంతో గొడవలు చేసే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. వినుకొండ నియోజకవర్గంలో ఐదేళ్లలో ఎనలేని అభివృద్ధి చేశామని వెల్లడించారు. వినుకొండకు తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు వంద పడకల ఆస్పత్రి, ట్రామాకేర్ సెంటర్, ఎన్ఎస్పీ కాలువల అభివృద్ధి, ఘాట్‌రోడ్డు నిర్మాణం, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్టేడియం వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్, నర్సింగ్, ఇంజినీరింగ్ కళాశాలలు వినుకొండ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జీవీ ఆంజనేయులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మ వద్దని, గతంలో ప్రజాధనాన్ని దోచుకొని ప్రభుత్వ చేపల చెరువులు కూడా సొంతగా చేపల వ్యాపారం చేసుకొని అన్నివర్గాలను మోసం చేశారని, అలాంటి మోసగాళ్ల మాటలు నమ్మి టీడీపీకి ఓటు వేస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని అన్నారు. ఎన్నికల్లో ఓటర్లు సరైన నిర్ణయం తీసుకొని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

శాంతియుత పోలింగ్‌కు ఏర్పాట్లు

మాచర్ల ఆర్వో శ్యాం ప్రసాద్




మాట్లాడుతున్న ఆర్వో శ్యాం ప్రసాద్

మాచర్ల రూరల్: ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలీసు అధికారులు, పోలింగ్ సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 299 పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలతో, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఐదుగురు ఆయుధాలతో కలిగిన పోలీసు భద్రతతో పాటు ఓటు హక్కు వినియోగించుకునే వారికి మౌలిక సదుపాయాలన్నీ కల్పించినట్లు వెల్లడించారు. ఘటన జరిగిన ఐదు నిమిషాల్లోనే భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకునేలా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి ఎన్నికల ఓటింగ్‌ను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికలలో విధులు నిర్వహించే ఉద్యోగులు ఇక్కడకు వచ్చేందుకు నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, గుంటూరు కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్ళే వారికి బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణపై ఫిర్యాదులు స్వీకరించేందుకు 08642 - 297366, 8142482720 నంబర్లుకు తెలియజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సుధాకర్ శర్మ, షేక్ బాషా పాల్గొన్నారు.

పోలింగ్ వివరాలు తక్షణమే అందించాలి

ఎన్నికల పరిశీలకులు నరేంద్ర, శ్రీహరి ప్రతాప్‌షాహి



నరసరావుపేట: మైక్రో అబ్జర్వర్లు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తూ సంబంధిత నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు పొందుపర్చాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు భూరేశ్వర నరేంద్ర, శ్రీహరి ప్రతాప్ షాహి ఆదేశించారు. సత్తెనపల్లి, గురజాల, మాచర్ల, పెదకూరపాడు నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులుగా నియమితులైన నరేంద్ర భువనచంద్ర టౌన్‌హాలులో శనివారం మాట్లాడారు. నియోజకవర్గంలో పోలింగ్ సమయంలో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే 9154690367కు కాల్‌చేసి వివరించాలని ఆయన తెలిపారు. ఎన్నికల విధులు నిబద్ధతతో పటిష్టంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకునిగా నియమితులైన శ్రీహరి ప్రతాప్ షాహి మాట్లాడుతూ ఫామ్-28ను అందజేసి దానిపై అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ సమయంలో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే 9154690375 నంబర్‌కి కాల్‌చేసి వివరించాలని సూచించారు.

ఎన్నికల నిర్దేశిత నివేదికలు సకాలంలో అందజేయాలి

ఎన్నికల జిల్లా అధికారి శివశంకర్ లోతేటి

నరసరావుపేట: ఎన్నికలకు సంబంధించి నిర్దేశిత నివేదికలు అన్ని సకాలంలో అందజేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కామెండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహిస్తూ 14వ తేదీ మధ్యాహ్నం వరకు అందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. వెబ్‌కాస్టింగ్ సంబంధించి రూంను జిల్లా కమాండ్ కంట్రోల్ రూం, కమ్యూనికేషన్ అండ్ మానిటరింగ్ కంట్రోల్ రూం, మీడియా మానిటరింగ్ రూంలు ఏర్పాటు చేశామని తెలిపారు. సిబ్బంది అందరి దగ్గర నియోజకవర్గానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని, విధులు నిర్వహిస్తున్న ఆర్వో, పోలీసు సిబ్బంది వివరాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. వెబ్‌కాస్టింగ్‌కు సంబంధించి నియోజకవర్గానికి ఒకరు ఎన్నికల రోజున సాయంత్రం ఏడు గంటల వరకు నిఘా ఉండాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, జిల్లా రెవిన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.







ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారం చివరి రోజున వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ ఎమ్మెల్యే అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార బహిరంగ సభకు నాదెండ్ల మండలం నుండి పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీగా తరలివచ్చారు.



తన భర్త అంబటి రాంబాబును గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి అంటి విజయలక్ష్మి



ప్రచార రథంపై ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ముగిసిన ఎన్నికల ప్రచారం

- సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు పూర్తి
- చివరి రోజు చిలకలూరిపేట సభకు జగన్ రావడంతో రెట్టించిన ఉత్సాహం
- చంద్రబాబు మాచర్ల, నరసరావుపేట సభల రద్దుతో డీలా పడ్డ తెలుగు తమ్ముళ్లు
- ఇప్పటికే ప్రతి ఇంటికీ రెండు మూడు సార్లు తిరిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- గెలుపు ధీమాతో పోల్ మేనేజ్మెంట్ పై ప్రత్యేక దృష్టి
- పరువు కాపాడుకునే ప్రయత్నంలో టీడీపీ నేతలు



ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

సాక్షి, నరసరావుపేట: అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. గత నెల రోజులుగా ముఖ్యంగా నామినేషన్ల పర్వం మొదలైన రోజు నుంచి మోగిన మైక్‌సెట్లు, డీజేలు బంద్ అయ్యాయి, వాహన ర్యాలీలకు బ్రేక్ పడింది. పోలింగ్ సమయం ముగిసే సోమవారం సాయంత్రం 6 గంటలకు వరకు నిశ్శబ్ద వాతావరణం కొనసాగనుంది. రాత్రి పగలు అంటూ తేడా లేకుండా ఇంటింటి ప్రచారం చేసిన అభ్యర్థులు ప్రచార పర్వం ముగియడంతో పోల్ మేనేజ్మెంట్‌పై దృష్టిపెట్టారు. ఓటర్ దేవుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకురావడంతోపాటు తమ గుర్తుపై నొక్కి ఓటు వేయించుకునేలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. మరోవైపు ప్రలోభాల పర్వం తుదిదశకు చేరింది. ఎన్నికల అధికారులు పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తుండగా పోలీసు అధికారులు హింసాత్మక ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సమరోత్సాహంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి అధికార వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఐదేళ్ల సంక్షేమ, అభివృద్ధి పాలనను గుర్తు చేస్తూనే, మరోసారి మోసం చేయడానికి వస్తున్న చంద్రబాబు కుట్రలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ప్రచారం సాగింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర పేరిట జిల్లాలో వినుకొండ, నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి నియోజకవర్గాలలో బస్సుయాత్ర చేసి ప్రజలను కలుసుకుని మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఎందుకు ఓటు వేయాలో వివరించారు. తరువాత విస్తృత పర్యటనల్లో భాగంగా నిర్వహించిన బహిరంగ సభల్లో జిల్లాలో మిగిలిన పెదకూరపాడు, మాచర్ల, చిలకలూరిపేటలో పర్యటించారు. దీంతో జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమరోత్సాహంతో ఉన్నారు. వైఎస్ జగన్ పాల్గొన్న బస్సుయాత్ర, బహిరంగసభలు భారీ సక్సెస్ అవ్వడం విజయ సూచిక అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రచారం గడువు ముగిసే రోజు చిలకలూరిపేటలో పర్యటించడంతో ఎన్నికల కదనరంగంలో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయనున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రచారం చివరి రోజు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు చేసిన ప్రచార ముగింపు ర్యాలీలు విజయోత్సవ యాత్రలా ఉండటం ఆ పార్టీ శ్రేణులకు విజయం పట్ల మరింత ధీమా కలిగించింది. మరోసారి పల్నాడు జిల్లా క్లీన్‌స్వీప్ కానుందని అంతటా వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పోల్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టారు. కీలకమైన ఈ రెండు రోజులు పార్టీ గెలుపు కోసం జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

డీలా పడ్డ తెలుగు తమ్ముళ్లు

ఫేక్ ప్రచారాలు, మౌత్ టాక్‌లను మాత్రమే నమ్ముకున్న తెలుగుదేశం పార్టీ పోలింగ్ ముంగిట డీలా పడింది. పక్కాగా గెలుస్తున్నాం, వేలల్లో మెజార్టీ అంటూ ఊదరగొట్టిన తమ్ముళ్లకు గ్రౌండ్ రియాల్టీ ప్రజలకు అర్థం కావడంతో సైలెంట్ అయ్యారు.

ఈ ఫేక్ ప్రచారాలతో నేతలు, కార్యకర్తలు గెలిచిపోయామన్న భ్రమల్లో పడి వారినే వారే మోసం చేసుకుంటున్నారన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. అయితే జిల్లాలో టీడీపీ అభ్యర్థుల విజయంపై పెద్దగా ఆశ లేకపోవడంతోనే చంద్రబాబు, పవన్, లోకేష్ లాంటి ముఖ్యనేతల సభలేవీ పోలింగ్ ముందు జరగలేదన్న భావన నెలకొంది. షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ నరసరావుపేట, మాచర్ల సభలు వాయిదాపడడాన్ని తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య ఉన్న అగాధం పోలింగ్ ముంగిట మరింత పెరగడం సైతం వారిలో మరింత గుబులు రేపుతోంది. జిల్లాలో కనీసం ఖాతా తెరచి పరువుకాపాడుకుంటే చాలన్న భావన టీడీపీ కేడర్‌లో నెలకొంది.

టీడీపీకీ ఓటు వేస్తే రిజర్వేషన్లు వద్దనుకున్నట్టే

- చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఈ ఎన్నికల్లో కూటమి ఓటమే లక్ష్యం
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన హాఫీజ్‌ఖాన్

సత్తెనపల్లి: ఎన్డీఏ కూటమికి ఓటు వేస్తే దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను వద్దనుకున్నట్లేనని, ముస్లిం సమాజం అర్థం చేసుకోవాలని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు విజ్ఞప్తి చేశారు . పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌తో కలసి ఆయన శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ దివంగత రాజశేఖర రెడ్డి కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ముస్లిం సామాజిక వర్గానికి జగన్‌మోహన్ రెడ్డి అండగా ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినా కూటమికి వేసినట్లేనన్నారు. చంద్రబాబుకి, తెలుగుదేశం పార్టీకి ఇవే చివరి ఎన్నికలు అన్నారు. ఒక్క జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలు చేసి ప్రజల్లోకి వస్తున్నారన్నారు. ఏనాడైనా చంద్రబాబు హామీలను అమలు చేసినట్లు చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎవరి కాళ్ళు అయినా సరే పట్టుకొని ముఖ్యమంత్రి కావాలన్నదే చంద్రబాబు లక్ష్యం అన్నారు. తెలుగుదేశం పార్టీకి ఓటమి ఖాయమని, ఆ పార్టీ ఈ ఎన్నికల అనంతరం రద్దవుతుందని లేదా బీజేపీలో కలుస్తుందన్నారు. సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పని చేస్తున్న వ్యక్తి కన్నా లక్ష్మీనారాయణ ఏ పార్టీలో ఎప్పుడు ఉంటాడో తెలియదని, తెలుగుదేశం పార్టీ శ్రేణులు గుర్తుపెట్టు కోవాలన్నారు. 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటర్లందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి నియోజకవర్గంలో తనను, పార్లమెంటులో డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించి, తద్వారా జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ఆయన అభ్యర్థించారు.

ఎన్డీఏ కూటమి ఓటమే లక్ష్యం....

ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేస్తున్న ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నామని, కూటమి ఓటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కర్నూలు ఎమ్మెల్యే ఎండీ హాఫీజ్ ఖాన్ అన్నారు. భారతీయ జనతా పార్టీ, ఆ పార్టీ నాయకులు చాలా స్పష్టంగా రిజర్వేషన్ రద్దు చేస్తున్నామని ప్రకటిస్తున్నారని, చంద్రబాబు నాయుడు మౌనం వదిలి 'దీన్ని మేము ఖండిస్తున్నామని చెప్పటం లేదన్నారు'. రిజర్వేషన్ రద్దు విధానాన్ని మీరు వెనక్కి తీసుకోపోతే కూటములోంచి బయటికి వస్తామని చంద్రబాబు నాయుడు నువ్వు చెప్పగలవా..? నీకు ఆ ధైర్యం ఉందా ? అని హాఫీజ్ ఖాన్ ప్రశ్నించారు. వేల పుస్తకాలు చదివాను అంటున్న పవన్ కళ్యాణ్ ముస్లిం సామాజిక వర్గ ఆర్థిక పరిస్థితుపై ప్రభుత్వ కమిషన్ల నివేదికలు చదవలేదా అని నిలదీశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు చేస్తున్న ప్రశాంతమైన పరిపాలనకు అందరూ సహకరించాలన్నారు. ఆయనను మరోసారి గెలిపించాలని కోరారు. సమావేశంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్,పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్ బాషా, షేక్ జానీ, ఏఎమ్‌సీ మాజీ వైస్ చైర్మన్ షేక్ జలీల్, పట్టణ అధికార ప్రతినిధి ఎస్ఎం యూనస్, గఫూర్ ఉన్నారు.

వైఎస్సార్ వారసుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఏపీ రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షుడు పొలిమేర

నరసరావుపేట: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వారసుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్న విషయం షర్మిల తెలుసుకోవాలని ఏపీ రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షుడు పొలిమేర వెంకట రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానేత వైఎస్సార్ మృతితో మీ కుటుంబాన్ని ఎంత ఇబ్బందులు పెట్టారో ప్రత్యక్షంగా చూశారని గుర్తు చేశారు. వివేకానందరెడ్డిని చంపింది కూడా ఎవరో షర్మిలకు తెలుసన్నారు. కానీ వాటన్నిటినీ మరిచి కాంగ్రెస్‌తో చేతులు కలిపి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులయ్యారని విమర్శించారు. జననేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అనరాని మాటలు అంటుంటే తెలుగు ప్రజలు ఓర్చుకోలేరని చెప్పారు. అవినాష్‌రెడ్డిపై ఎలాంటి ఆరోపణలు చేస్తున్నారో, ఎలాంటి మాటలు అంటున్నారో ఆలోచించుకోవాలన్నారు. మీకు ఏ ప్యాకేజీ ఇచ్చారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. నీవు వైఎస్ కుటుంబానికి వారసురాలివి ఎలా అవుతావని నిలదీశారు. రాజశేఖరరెడ్డి మరణం నుంచి ఆయన వారసుడిగా 15 ఏళ్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోనే ఉన్నారన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను ప్రజలు షర్మిలను నమ్మరన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆలోచించి మంచి నిర్ణయం తీసుకొని మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని చెప్పారు.

మా ఓట్లు అమ్మబోము



మాచర్ల: పట్టణంలోని 26వ వార్డులో ఉన్న ముస్లిం నేత గులాం హుస్సేన్ తమ కుటుంబంలోని ఏ ఒక్క ఓటును అమ్మబోమంటూనే తన ఇంటి ముందు బోర్డు ఏర్పాటు చేశాడు. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయానికి వెళ్లే రహదారిలోని డబ్బులకు తమ ఓటు అమ్మబోము అంటూ ఫ్లెక్సీ పెట్టారు. ఇదే విషయాన్ని తన ఇంటి ముందు నిలబడి ప్రచారం చేయ భిజఆకర్షిస్తోంది.

మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభంజనమే



భారీగా ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

- ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- భారీ ఎన్నికల ర్యాలీ
- దద్దరిల్లిన జగనన్న నినాదం

మాచర్ల: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభంజనమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా పట్టణంలో శనివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో కుట్రలు, కుతంత్రాలు, కూటములు పేరుతో అన్ని వర్గాలను మోసగించేందుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు బయలుదేరినట్లు హెచ్చరించారు. రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించి కుల, మత, రాజకీయాల పేరుతో యుద్ధం సృష్టించి ఫ్యాక్షనిస్టులకు సీట్లు ఇచ్చి కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి ఆయా నియోజకవర్గాలలో టీడీపీ పెయిడ్ ఆర్టిస్టులను దింపారని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో 11 ఎత్తిపోతల పథకాలతో పాటు కీలకమైన వరికపూడిశెల ప్రాజెక్టు నిధులు కేటాయించి పనులు ప్రారంభించిన ఘనత జగన్‌దేనన్నారు. వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ర్యాలీలో సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, రాష్ట్ర డైరెక్టర్లు కామన బోయిన కోటయ్య, ఉప్పలపాటి జాని, బూదాల మరియమ్మ, ఆయా వార్డు కౌన్సిలర్లు సుభాని, మస్తాన్, అనంతరావమ్మ, పోలా శ్రీనివాసరావు, పోలూరి నరసింహారావు, చిల్లంచర్ల సత్యనారాయణ, మందా సంతోష్, వేల్పుల గురవయ్య, ఆదిరాల నాగమణి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం

జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్



సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రశాంతగా ఎన్నికలు నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివ శంకర్, జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసిందన్నారు. పోలింగ్ నిర్వహించేందుకు ఆదివారం ఏడు నియోజకవర్గాల్లో ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి తరలింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. పోలింగ్ రోజు ఉదయం మాక్ పోలింగ్ తర్వాత ఏడు గంటల నుంచి అసలు పోలింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ నిలిపివేస్తారని, క్యూలో ఉన్న వారికి మాత్రమే ఓటువేసే అవకాశం కల్పిస్తారని వివరించారు. జిల్లాలో 557 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, వాటిలో పోలింగ్‌కు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం..

వేసవిని పురస్కరించుకొని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడనిచ్చే సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. సెల్‌ఫోన్లు పోలింగ్‌స్టేషన్లకు తీసుకెళ్లటం నిషేధమన్నారు. మాచర్ల, వినుకొండ, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల్లో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 1,929 పోలింగ్ స్టేషన్లలో 1,676 పోలింగ్‌స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రతి స్టేషన్‌లో సీసీ టీవీ కెమెరా ఏర్పాటు చేశామని, మొత్తం రికార్డు అవుతుందన్నారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ గుంపులుగా తిరగటం, లౌడ్‌స్పీకర్లు పెట్టడం నిషేధమన్నారు. మద్యం విక్రయాలు నిలిపివేసినట్లు తెలిపారు. సుమారు నాలుగువేల పైచిలుకు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా 19 కంపెనీలు కేంద్ర బలగాలు కేటాయించారన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద కేంద్రబలగాలు పహారా ఉంటాయని చెప్పారు. వీటితో పాటు కర్ణాటక, తమిళనాడు బలగాలు ఉన్నాయని, 34 స్ట్రైకింగ్ ఫోర్స్ పనిచేస్తాయన్నారు. వెబ్‌కాస్టింగ్‌తో పాటు 800 కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, పోలింగ్ అధికారులను బెదిరించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రీపోలింగ్ లేకుండా పోలింగ్ నిర్వహించండి

నరసరావుపేట: జిల్లాలో పోలింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించి రీపోలింగ్‌కు అవకాశం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకులు ఖరే సర్వేశ్వర నరేంద్ర, శ్రీహరి ప్రతాప్ షాహీ సమక్షంలో ఏడు అసెంబ్లీలకు సంబంధించిన ఎన్నికల పీఓ, ఏపీఓల, ఓ.పి.ఓలు, సూక్ష్మ పరిశీలకులుకు నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ. భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నిఘా నీడలో ఎన్నికలకు సిద్ధం

- సమస్యాత్మక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు
- జిల్లాలో 800 చోట్ల కెమెరాలు ఏర్పాటు
- నిరంతర పర్యవేక్షణలో ప్రశాంత ఎన్నికలకు సమాయత్తం

ముప్పాళ్ళ: జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు పోలీసు శాఖ సమాయత్తమైంది. అందులో భాగంగా ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో గత ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. అసాంఘీక చర్యలకు పాల్పడే వారిపై నిఘా ఉండేలా ఏర్పాట్లు చేశారు. నిరంతర పోలీసు పర్యవేక్షణ ఉండేలా సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా పెదకూరపాడు, గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలోను లోపల, బయట కూడా వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. వీటితో పాటుగా జిల్లాలోని పలు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం లోపల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన అది రికార్డు అవుతుంది. అలాగే ఇంకో లేయర్‌లో పోలింగ్ కేంద్రం బయట వెబ్‌కాస్టింగ్ జరుగుతుంది. ఈ సీసీ కెమెరాలకు సంబంధించి లైవ్ మానిటరింగ్ జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలోని మానిటరింగ్ రూమ్‌తో అనుసంధానం చేయబడుతుంది. ఏ చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా దగ్గరలో ఉన్న క్విక్ రెస్పాన్స్ టీం లేదా రాపిడ్ రెస్పాన్స్ టీం లను సత్వరం అక్కడికి తరలించి ఆ సమస్యను పరిష్కరించి ప్రశాంత పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు. గత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఇప్పటికే ప్రతి గ్రామంలోను అదనపు పోలీసు బలగాలతో కవాతుతో పాటుగా, ప్రశాంత ఎన్నికల నిర్వహణపై గ్రామ స్థాయి అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశారు.

జిల్లాలో 800 సీసీ కెమెరాలు ఏర్పాటు : జీ.బిందుమాధవ్, పల్నాడు జిల్లా ఎస్పీ

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 800 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అత్యంత సమస్యాత్మకమైన పల్నాడు ప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల్లో అన్ని పోలింగ్ స్టేషన్‌లోను లోపల బయట వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించాం. ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నించే వారి కదలికలు రికార్డు అవుతాయి. పల్నాడులో ప్రశాంత ఎన్నికలు జరగటమే లక్ష్యంగా పోలీసుశాఖ అన్ని రకాల చర్యలు చేపట్టి పనిచేస్తుంది.